క్లుప్తంగా

గిరిజనుల శ్రమదానం



శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం: ఇటీవల వర్షాలకు మండలంలోని దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం డ్యామ్ కింద ఉన్న సీసీ రోడ్డు కొట్టుకుపోయింది. దీని మరమ్మతులకు ఎంపీటీసీ సభ్యుడు కొవ్వాసి గోవిందరాజు ఆధ్వర్యంలో గిరిజనులు శ్రమదానం చేశారు. రహదారి లేకపోవడం వల్ల దొరమామిడి, బుట్టాయగూడెం వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నామని గోవిందరాజు తెలిపారు. ఇంకా అనేక చోట్ల కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. చింతల కృష్ణ పాల్గొన్నారు.

ఊటుకూరుకి నాగభైరవ పురస్కారం



వరప్రసాద్

కొయ్యలగూడెం: నాగభైరవ సాహిత్య పురస్కారానికి కొయ్యలగూడెంకు చెందిన రిటైర్డ్ టీచర్ డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్ ఎంపికయ్యారు. 18వ తేదీ ఒంగోలు మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించే కార్యక్రమానికి తాను హాజరు కావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందిందని వరప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. వివిధ సాహిత్యాలపై తాను చేసిన రచనలకు, ప్రభుత్వ పాఠశాలల్లోని పాఠ్యపుస్తకాలలో ప్రచురించిన అంశాలకు పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కాత్యాయని పీఠ వ్యవస్థాపకులు దాసరోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక వెంకయ్యపాలెం రోడ్డులోని శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘ భవనం వద్ద 50 మంది మహిళలకు రూ.20 వేలు విలువైన చీరలు పంపిణీ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా తన వంతు సహకారం అందించినట్టు దాసరోజు తెలిపారు. జవ్వాది శ్రీనివాసు, దార్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరింపూడిలో వైద్య శిబిరం



పరింపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొయ్యలగూడెం: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం పరింపూడి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. డెంగీ కేసు గుర్తించిన నేపథ్యంలో వైద్యాధికారులు ఎస్తేరు రాణి, తస్లీమా గ్రామంలో పలువురి రక్త నమూనాలు సేకరించారు. సిబ్బందిని అప్రమత్తం చేశామని వారు తెలిపారు. ఈ శిబిరంలో జనరల్, సీజనల్ వ్యాధులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు గొలిశెట్టి శ్రీనివాస్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న జిజ్జువరపు రవిప్రకాష్

చింతలపూడి: ఎస్సీ, బీసీ, లిడ్ క్యాప్ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను వెంటనే మంజూరు చేయాలి దళిత సేన నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చింతలపూడి పట్టణంలో దళిత సేన జిల్లా కార్యకర్తల సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదియా అధ్యక్షతన నిర్వహించారు. దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల ఆర్థికంగా అభివృద్ధికి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు. ఏలూరు జిల్లా దళిత సేన సలహా అధ్యక్షులు స్టాలిన్, చింతలపూడి మండల మహిళా అధ్యక్షురాలు మోనూరు దేవమాత, చింతలపూడి పట్టణ యూత్ ప్రెసిడెంట్ కార్తిక్, మహిళా కార్యదర్శి మంగ, దళిత సేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు హలో మాల.. చలో ఏలూరు

ద్వారకాతిరుమల: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 17న నిర్వహించే హలో మాల.. చలో ఏలూ రు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే ద్వారకాతిరుమల, దొరసానిపాడు, సత్తెన్నగూడెం, కొమ్మర, కోడిగూడెం గ్రామ ప్రజలను ఆహ్వానించినట్టు తెలిపారు.

జ్వరాలతో వణుకుతున్న కమ్మరిగూడెం

- కదలలేని స్థితిలో గిరిజనులు
- గ్రామంలో అందరికీ ఒంటి నొప్పులు, కాళ్ల వాపులు
- అందుబాటులో లేని ప్రభుత్వ వైద్యం
- ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులతో ఇల్లు గుల్ల



గ్రామంలో ఇళ్ల ముందు పేరుకుపోయిన మురుగు నీరు



అపరిశుభ్రంగా ఉన్న హ్యాండ్ బోర్ ప్రాంతం

వేలేరుపాడు: మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా మొన్న పెద్దవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోయి వరద పోటుకు గురికాగా, తాజాగా విష జ్వరాలు ఆ గ్రామాన్ని వణికిస్తున్నాయి. దీంతో ఆ గ్రామ గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేక ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని కమ్మరిగూడెంలో గిరిజనులు ఇంటిల్లిపాది జ్వరంతో మంచం పడుతున్నారు. ఈ గ్రామంలో మొత్తం 220 కుటుంబాలున్నాయి. ఇందులో సుమారు 160 కుటుంబాల వరకు జ్వర పీడితులే ఉన్నారు. గత నెల 18న తెలంగాణలోని అశ్వారావుపేట మండలంలో పెద్దవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోవడంతో నీటి ప్రవాహానికి ఊరంతా కొట్టుకుపోయింది. వరద వచ్చిన వారం వ్యవధిలో జూలై 22న గ్రామంలో రెండు దఫాలు వేలేరుపాడు వైద్యాధికారి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ తర్వాత వైద్యశాఖ అటు వైపు కన్నెత్తి చూడలేదు. వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆ గ్రామ గిరిజనులపై జ్వరాలు పంజా విసిరాయి. జ్వరం వచ్చిన రెండు రోజులకే ఒళ్లు నొప్పులు, కాళ్లు, ముఖం వాపులు, కాళ్లపై నల్లని మచ్చలు వస్తున్నాయని గిరిజనులు చెబుతున్నారు. కొందరు జ్వరం వచ్చి వారం దాటాక కూడా నడవలేక కర్రలు చేత పట్టి నడుస్తున్నారు. మరి కొందరు మంచానికే పరిమితమవుతున్నారు. ఇంతకు మునుపెన్నడూ ఇటువంటి జ్వరాలు లేవని ఇవేమి వింత జ్వరాలని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరు వైద్యం నిమిత్తం వేలేరుపాడు మండల కేంద్రానికి రావాలంటే పెద్దవాగు ఆటంకంగా ఉండటంతో తెలంగాణలోని అశ్వారావుపేట మండలం రంగాపురం, గుమ్మడపల్లి, మీదుగా అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. గ్రామంలో ప్రతి జ్వర పీడితుడి చేతికి ఐవీ క్యాన్‌లు కన్పిస్తున్నాయి. ఇవన్నీ ప్రైవేట్ వైద్యులు అమర్చినవే.

అపరిశుభ్రతే కారణమా?

గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. కానీ వరద వల్ల గ్రామం కొట్టుకుపోయాక అపరిశుభ్రత తాండవిస్తోంది. దీని గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. ఇళ్లదగ్గరే మురికి కాలువలు ఉన్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని అధ్వాన్నంగా ఉంది. నేటివరకు అధికారులు ఫాగింగ్ చేయలేదు. కనీసం బ్లీచింగ్ చల్లడంలేదు. క్లోరినేషన్ లేదు. రాత్రి పగలు తేడా లేకుండా దోమలు కుట్టి చంపుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో మంచి నీటి పథకం ఫిల్టర్ పాయింట్ పెద్దవాగు వరదలో కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్తులు హ్యాండ్ బోర్ నీటినే తాగునీరుగా వాడుతున్నారు.

నడవలేని స్థితిలో దుర్గారావు



ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పేరు కుంజా దుర్గారావు. ఇతనిది కమ్మరిగూడెం గ్రామం. వారం రోజులుగా ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు జ్వరంతో బాధపడుతున్నాడు. నడవలేకపోతున్నాడు.

భరించలేని నొప్పులు



ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ పేరు కుంజా కామమ్మ. ఈమెది కమ్మరిగూడెం గ్రామం. గత తొమ్మిది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. కాళ్ల వాపులు, భరించలేని ఒళ్లు నొప్పులు ఉన్నాయని చెబుతోంది. కర్ర చేత పట్టుకుంటేనే నడవగలుగుతున్నాను అంటోంది. ఈ బాధ ఇంకెంతకాలం భరించాలో తెలియడంలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది.

కర్ర లేకుంటే నడవలేను



ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పేరు బోసుబాబు. ఇతనిది కమ్మరిగూడెం గ్రామం. విద్యా వలంటీర్. పది రోజులుగా కుటుంబంలో భార్య అభియ, కుమారుడు సాత్విక్ జ్వరంతో బాధ పడుతున్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికి తిరిగి వచ్చాక మళ్లీ జ్వరం వచ్చింది. 25 ఏళ్ల బోసుబాబు కాళ్లు, చేతులు వాపులు వచ్చాయి. ప్రస్తుతం కర్ర సాయంతో నడుస్తున్నాడు. తాను కోలుకోవాలంటే ఎన్ని రోజులు పడుతుందోనని బోసుబాబు ఆందోళన చెందుతున్నాడు.

జ్వరం తగ్గడం లేదు



ఈ ఫొటోలో కన్పిస్తున్న దంపతుల పేర్లు కుంజా శ్రీను, స్వామి లక్ష్మి. వీరు వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. రాత్రి సమయంలో జ్వరం ఎక్కువగా వస్తోందని, దీంతో ఏ పని చేయలేకపోతున్నామని, మందులు వాడినా జ్వరం తగ్గడం లేదని, ఇప్పటికీ ఐదు వేలు ఖర్చు అయినా జ్వరం తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనాలోచిత నిర్ణయం.. నిలిచిన భవన నిర్మాణం





భవన నిర్మాణం పై నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లు

పోలవరం రూరల్: అధికారుల అనాలోచిత నిర్ణయం కారణంగా పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చేపట్టిన ల్యాబ్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గతేడాది ఎన్‌హెచ్ఆర్ఎం పథకం నిధులు రూ.50 లక్షలు మంజూరవడంతో కాంట్రాక్టర్ ల్యాబ్ భవన నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటికే కొన్నేళ్లుగా వైద్యశాల కాంపౌండ్ వాల్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలతో పాటు వైర్లు కూడా ఉన్నాయి. వీటిని పరిశీలించకుండా భవన నిర్మాణం చేపట్టారు. ఈ పనులు శ్లాబ్ లెవెల్ వరకు వచ్చాయి. తీరా శ్లాబ్‌వేసే సమయానికి విద్యుత్ వైర్లు తగులుతున్నాయని రెండు నెలలుగా పనులు నిలిపివేశారు. దీనిపై పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఏఈ సందీప్‌ను ప్రశ్నించగా.. శ్లాబ్‌కు అడ్డొస్తున్న వైర్లను తొలగించాలని ఉన్నతాధికారులకు లెటర్ పెట్టామన్నారు. ఇటీవల ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యాధికారి కె.నిఖిల్ భవన నిర్మాణం విషయాన్ని ప్రస్తావించగా. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి విద్యుత్‌శాఖ ఏఈతో ఫోన్‌లో సంప్రదించారు. స్తంభాలు, వైర్లు మార్చడానికి సుమారు రూ.1లక్ష వరకు ఖర్చు అవుతుందని, ఈ మొత్తం చెల్లిస్తే వైర్లు మార్చుతామని ఏఈ తెలిపారని వివరించారు. ఈ ఖర్చు ఎవరు భరిస్తారనేది చర్చనీయాంశమైంది. భవనం నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

వంతెన నిర్మాణం చేపట్టాలి



వర్షం దాటికి కొట్టుకుపోయిన గుండేటి వాగు వంతెన

కుక్కునూరు: జూలై 18వ తేదీన కురిసిన భారీ వర్షం దాటికి మండలంలోని కుక్కునూరు – దాచారం మధ్య ఉన్న గుండేటి వాగు వంతెన రెండు పిల్లర్లతో సహా కొట్టుకుపోయింది. దీంతో కుక్కునూరు మీదుగా దాచారం, గొమ్ముగూడెం పంచాయతీలకు వెళ్లే రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఈ పంచాయతీల పరిధిలోని సుమారు 10 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి, వేలేరుపాడు మండల వాసులు భద్రాచలం వెళ్లేందుకు కూడా ఇదే దగ్గర దారి. శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాకంబరిగా కుంకుళ్లమ్మ దర్శనం



కుంకుళ్లమ్మవారు

ద్వారకాతిరుమల: శ్రావణమాసం రెండో శుక్రవారం, వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మవారు ఫల, కూరగాయల అలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. శాకంబరిగా ఉన్న అమ్మవారిని దర్శిస్తే సకల సౌభాగ్యాలు, శుభాలు కలుగుతాయని పండితులు తెలిపారు.

గాయత్రిగా వాసవీమాత

కొయ్యలగూడెం: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని వాసవీ మాత ఆలయంలో అమ్మవారు వేదమాత గాయత్రిగా దర్శనమిచ్చారు.

గంగానమ్మకు చీరల అలంకరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మవారిని చీరలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్య మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాలమ్మ వారు స్వర్ణవర్ణ పూర్ణకవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి వెండి చీర తయారీకి భక్తులు 31 తులాల వెండిని సమర్పించుకున్నట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

ఆధ్యాత్మిక శోభ

కుక్కునూరు: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శివాలయంలో అమ్మవారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో శరణ్యకు ద్వితీయం



కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న శరణ్య

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని సిరిబత్తిన శరణ్య జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మిక నిర్మూలన, బాలల సరంక్షణ అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన శరణ్య గురువారం ఏలూరులోని కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన హై టీ కార్యక్రమంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, జేసీ ధాత్రి రెడ్డి, కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి మెమెంటో, ప్రశంసా పత్రం అందుకుంది. శరణ్యను, ఆమెకు శిక్షణ ఇచ్చిన తెలుగు పండిట్‌లు మద్దాల పెద్దిరాజు, కె.రమేష్‌లను శుక్రవారం ఎంఈఓలు వి.సుబ్బారావు, పరసా వెంకట్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సురేష్, పాఠశాల యాజమాన్య కమిటీ, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

శివాలయానికి రూ.1.11 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం: అంకాలగూడెం శ్రీ ఉమా సమేత భోగ లింగేశ్వర స్వామి ఆలయానికి కొయ్యలగూడెంకి చెందిన నిడదవోలు రామారావు, నాగలక్ష్మి దంపతులు శుక్రవారం ఆలయ కమిటీకి రూ.1,11,116 విరాళం అందజేశారు. గాలి గోపుర నిర్మాణానికి ఈ విరాళాన్ని వినియోగించాలని వారు కోరారు. ఆలయ పాలకమండలి, అభివృద్ధి కమిటీ సభ్యులు, గాలిగోపురం నిర్మాణ కమిటీ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



నాసిరకంగా మరమ్మతులు చేపట్టిన రాళ్లపూడి నుంచి రుద్రమకోట వెళ్లే రహదారిని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

వేలేరుపాడు: పెద్దవాగు ఆనకట్ట తెగిపోయి ప్రవాహంలో కొట్టుకుపోయిన రహదారుల మరమ్మతులు పటిష్టంగా చేపట్టాలని సీపీఐ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబా, మండల కార్యదర్శి బాడిశ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వరద వల్ల దెబ్బతిన్న రహదారులను వారు పరిశీలించారు. వేలేరుపాడు మండలంలో చేపట్టిన రోడ్ల మరమ్మతులు నాసిరకంగా జరుగుతున్నాయని ఆరోపించారు. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారి, మేడేపల్లి నుంచి రుద్రమకోట వెళ్లే రహదారి, పూర్తిగా దెబ్బతిందని, అయితే సదరు కాంట్రాక్టర్లు పక్కనే ఉన్న మామూలు మట్టిని తవ్విపోశారని, చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా తయారై వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. రాళ్లపుడి మూలమలుపు నుంచి రుద్రమకోట వరకు చేపట్టిన మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాలిచ్చారని, గుళ్లవాయి వద్ద పక్కనే ఉన్న మట్టిని తవ్విపోశారని ఆరోపించారు. రహదారి మరమ్మతులు చేపట్టేటప్పుడు కనీసం ఏఈ, డీఈ స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం విచారకరమని తెలిపారు. వేలేరుపాడు మండల కేంద్రంలో గత మూడు నెలల క్రితం కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులు చేపట్టగా, ఇటీవల కురిసిన వర్షానికే కొట్టుకుపోయిందని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మరమ్మతులు నాణ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



పాత బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్న మహా ధర్నా

చింతలపూడి: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పు దళితులను తీవ్ర నిరాశకు గురి చేసిందని మాలల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు చింతలపూడి పాత బస్టాండ్‌లో మాలల జేఏసీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ అనుకూల ప్రకటనలను ఖండించాయని తెలిపారు. దళితులు ఐక్యంగా లేకపోవడం వల్లనే వివిధ పార్టీలు వర్గీకరణ చేస్తామని మాటలు ఇస్తున్నాయని, వర్గీకరణకు రాజకీయ కారణాలే తప్ప సామాజిక కారణాలు లేవని చెప్పారు. వర్గీకరణను ఏజెండాగా తీసుకున్న పార్టీలకు మాలల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయకుండా వర్గీకరణ చేసే అధికారం సుప్రీం కోర్టుకు లేదా రాష్ట్రాలకు లేదని, ఇది పార్లమెంటులో పెడితే ఆమోదం పొందలేదని తెలిసే దొడ్డి దారిన సుప్రీం కోర్ట్ ద్వారా ఈ తీర్పు కేంద్ర ప్రభుత్వ పెద్దలే చెప్పించారని ఆరోపించారు. తక్షణం ఈ తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంకపల్లి భాను, పిట్టా వేణు, కాకర్ల సత్యనారాయణ, కలుకుర్తి నాగేశ్వరరావు, సరిపల్లి వెంకటేశ్వరరావు, తొర్లపాటి బాబు, గొంది రాజు, మానేపల్లి రాజారావు, జైపాల్, రాజారత్నం, బేతు మహాలక్ష్ముడు, నత్తా రవి, జూపూడి వసంతరావు, కంచర్ల బుచ్చిబాబు, బూసి ముత్తేశ్వరరావు, మారుముడి రవి, మారుముడి కుమారి, మద్దా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ మహిళ ఆవేదన

లింగపాలెం: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న తనపై కలరాయనగూడెంకు చెందిన కొల్లి సాల్మన్ రాజు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని అదే గ్రామానికి చెందిన మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి సాల్మన్‌రాజును అడ్డుకోపోగా వారిని విదిలించుకుని పారిపోయినట్టు ఆమె విలేకర్లకు తెలిపింది. గతంలో ఇలాగే ఇబ్బంది పెడుతుండగా పెద్దలకు చెప్పినా తనకు న్యాయం చేయలేదని, ఇదే అదునుగా చూసుకుని మళ్లీ తనపై అత్యాచార ప్రయత్నం చేశాడని కన్నీరు మున్నీరైంది. ఈ విషయంపై ధర్మాజీగూడెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చానని బాధితురాలు తెలిపింది.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

కుక్కునూరు: మండలంలోని అమరవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పదో తరగతి 1990–91వ విద్యా సంవత్సరం విద్యార్థులు గంజి రామచక్రధర్‌రావు, పల్లాల రవీంద్రనాథ్‌లు రూ.20 వేలు విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సత్యనారాయణ అభినందించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత



దెందులూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత ఆదేశించారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ ఏ శాఖలోనైనా మండలాధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులు వారి పరిధిలో పని సక్రమంగా చేయకపోతే తద్వారా వచ్చే చెడ్డ పేరు, అన్ని శాఖల అధికారులు భరించాల్సి ఉంటుందని అన్నారు. బాధ్యతగా గ్రామస్థాయి ఉద్యోగులు వారి పరిధిలో పనులు పూర్తి చేయాలన్నారు. దెందులూరు బస్టాండ్ సెంటర్, లైబ్రరీ సెంటర్, ఉన్నత పాఠశాలతో ఇతర ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడం, నెలలు తరబడి అక్కడ ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అన్ని గ్రామాల ప్రజలు భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని అన్నారు. ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, ఇతర మండల అధికారులు శాఖల వారీగా వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ భీమరాజు, మండలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రగడవరంలో పట్టపగలే చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం గ్రామానికి చెందిన కె.వెంకటాచారి అనే వ్యక్తి ఇంట్లో పట్ట పగలే దొంగలు పడ్డారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బీరువాలో ఉన్న రూ.60 వేలు, రెండు కాసుల బంగారు ఆభరణాలు దోచుకున్నట్టు బాధితుడు తెలిపారు. ఘటనా స్థలిలో ఎస్సై కుటుంబరావు విచారించారు.

సిమెంట్ ఏజెన్సీ పేరుతో మోసం

దెందులూరు: సిమెంట్ కంపెనీ ఏజెన్సీ ఇప్పిస్తానని రెండు విడతలుగా రూ.లక్షా 72 వేలు నగదు తీసుకుని కడపకు చెందిన ఉండేళ్ల కిరణ్‌కుమార్ రెడ్డి మోసం చేశాడని మద్దా భూషణం అనే వ్యక్తి శుక్రవారం దెందులూరు పోలీసులను ఆశ్రయించాడు. రామారావుగూడెంలో తనకు సిమెంట్ కంపెనీ ఏజెన్సీ ఇప్పిస్తానని, మధ్యవర్తి ద్వారా పరిచయమై కిరణ్‌కుమార్‌రెడ్డి నేరుగా, ఫోన్ పే ద్వారా రెండు విడతలుగా రూ.లక్షా 72 వేలు తీసుకున్నాడన్నారు. తీసుకున్న తరువాత మధ్యవర్తి, డబ్బులు తీసుకున్న వ్యక్తి, ఏజెన్సీకి సంబంధించి ఎవరూ మాట్లాడటం లేదని విలేకరుల వద్ద వాపోయాడు. భూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.స్వామి తెలిపారు.